క్లుప్తంగా

ఘనంగా గణిత దినోత్సవం



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పలు పాఠశాలల్లో సోమవారం గణితశాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సమగ్ర ఉద్యోగులకు సంఘీభావం



సమగ్ర శిక్ష ఉద్యోగులతో తపస్ నాయకులు

మోమిన్‌పేట: డిమాండ్ల సాధనలో భాగంగా సమ్మె బాటలో ఉన్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సోమవారం మోమిన్‌పేట, మర్పల్లి మండలాల ఉపాధ్యాయుల తపస్ కమిటీ అధ్యక్షుడు మధుకర్, కార్యదర్శి మహేశ్‌లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

చైర్మన్‌కు సన్మానం

కుల్కచర్ల: కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఆంజనేయులు ముదిరాజ్‌ను అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ ఘనంగా సన్మానించారు. సోమవారం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి సత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య, సేవాలాల్ సేన జిల్లా నాయకులు కుల్దీప్ సింగ్, తదితరులు ఉన్నారు.

లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం

బంట్వారం: సీఎం కప్ జిల్లా స్థాయి లాంగ్ జంప్ పోటీల్లో కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ శివప్రసాద్ రెండో స్థానంలో నిలిచారు. సోమవారం వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించిన టోర్నీలో శివప్రసాద్ ద్వితీయ స్థానంలో గెలుపొందారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి ఆయనకు జ్ఞాపికతో పాటు.. ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రయోగాలు బాగున్నాయి

అనంతగిరి: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సోమవారం వికారాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రేణుకా దేవి చిన్నారులను అభినందించారు. ప్రయోగాలు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ శ్వేతా ప్రశాంతి, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ గఫార్‌కు సన్మానం



ఎస్‌ఐకి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

బంట్వారం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్‌ను యువజన సంఘం నాయకుడు అరుణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. వారికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. యువజన సంఘం నాయకులు సంతు, హరి, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

కుల్కచర్ల: విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని షీటీం పరిగి సర్కిల్ ఇన్‌చార్జి నర్సింహులు అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పోలీసు చట్టాలు, సమాజంలో జరుగుతున్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటుగా సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, బాల్య వివాహాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, డయల్ 100 వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

దారులు ధ్వంసం



దేశాయిపల్లి- ఇందాపూర్ రోడ్డు దుస్థితి

- పరుగులు తీస్తున్న కేజ్‌వీల్స్
- పాడవుతున్న గ్రామీణ రోడ్లు
- పట్టించుకోని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ట్రాక్టర్ల యజమానులు వ్యవసాయ సీజన్లలో కేజ్‌వీల్స్‌తో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పలు గ్రామాల రహదారులు ధ్వంసమవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు కొద్ది రోజులకే గుంతలు పడుతున్నాయి. వరినాట్ల కోసం వినియోగించే కేజ్‌వీల్స్(ఇనుప చక్రాలు)తో ట్రాక్టర్లను నడపడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోందని ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు. ఏళ్ల తరబడి మన్నికగా ఉండాల్సిన రోడ్లు అతి తక్కువ కాలంలోనే పాడవ్వడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వీటిని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

క్షేత్రస్థాయి పర్యవేక్షణ కరువు

సీజన్ల వారీగా వ్యవసాయ పనులు చేపట్టే సమయంలో, క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదు. దీంతో కేజ్‌వీల్స్‌తో రోడ్లపై యథేచ్ఛగా రాకపోకలు సాగుతున్నాయి. అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడంతో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపైకి ఇష్టానుసారంగా వచ్చి దారులను పాడు చేస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని దేశాయిపల్లి, యాంకి, ఇందాపూర్, గుముడాల, బిచ్చాల, తిమ్మారెడ్డిపల్లి, బాలంపేట, కొడీడ్, నర్సాపూర్ గ్రామాలకు వెళ్లే దారులు ధ్వంసమవుతున్నాయి. ఇనుప రోడ్లపై చారలు ఏర్పడి ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి.

అవగాహనతోనే అదుపు

గ్రామీణ ప్రాంతాల్లోని బీటీ రోడ్లను కాపాడేందుకు రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పోలీసులు సంయుక్తంగా వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే స్పందించాలి. రైతులతో పాటు ట్రాక్టర్ యజమానులతో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలి. కేజ్‌వీల్స్ చక్రాలతో ఎవరైనా రోడ్లపైకి వచ్చినా.. రాకపోకలు సాగించినా.. బాధ్యులకు జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించాలి. ఇలాంటి హెచ్చరికలు చేయకపోవడం, జరిమానాలు విధించని కారణంగా యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రాత పరీక్షలు రద్దు చేయాలి



తాండూరు టౌన్‌లో.. ఏఎన్‌ఎంల నిరసన



అనంతగిరి: అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కాంట్రాక్ ఏఎన్‌ఎంల డిమాండ్

తాండూరు టౌన్: రాత పరీక్ష విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. సోమవారం తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలావతి, వెంకటమ్మ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రేయింబవళ్లు విధులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు.. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు మల్లమ్మ, వైదేహి, పుష్ప, కవిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: రాత పరీక్షను రద్దు చేసి కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ వికారాబాద్ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు లీలావతి డిమాండ్ చేశారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు వెంకటమ్మ, మల్లమ్మ, సంతోష, మమత, అంజమ్మ, సుకన్య, నర్సమ్మ, స్వేత వసంత పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు..

మున్సిపల్ కార్మికుల వేతనాలను రూ.30 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్‌లో కార్మికులు ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో పాటు, ప్రమాదబీమా రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాండూరు టౌన్: బీసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో గ్లోబల్ యువతరం ఫౌండేషన్ నేతృత్వంలో, శంకర హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రాము మిత్రబృందం, టైలర్ అనితారమేష్, నరేందర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, అటెండర్లకు అల్పాహారం అందజేశారు. మల్‌రెడ్డిపల్లి, ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు, రెడ్డి ఘనాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు.

గర్భకోశ చికిత్స తప్పనిసరి

మర్పల్లి: పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ వైద్య పరీక్షలు చేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధి గుర్రగట్టుతండాలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు నట్టల నివాణ పరీక్షలతో పాటు సాధారణ పరీక్షలు ప్రతి గ్రామంలో ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, సిబ్బంది మోహన్‌రావు, రమేష్, స్థానిక రైతులు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు

ధారూరు: వ్యవసాయ మార్కెట్లో సీసీరోడ్ల నిర్మాణానికి జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.30 లక్షలు మంజూరు అయ్యాయని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్లో మేయిన్‌రోడ్డు నుంచి వ్యవసాయ కార్యాలయం వరకు సీసీ నిర్మాణానికి రూ.10 లక్షలు, ఏఎంసీ కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు రూ.10 లక్షలు, ఏఎంసీ దుకాణాల సముదాయం ఎదుట సీసీ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించినట్లు ఆమె వివరించారు.

27 నుంచి ఎల్లమ్మ జాతర

యాలాల: ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ముద్దాయిపేట రేణుక ఎల్లమ్మ జాతరలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు భానుప్రసాద్ గౌడ్, ఉపాధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి సంపత్‌కుమార్ గౌడ్‌లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న రాజమండ్రి, హైదరాబాద్‌లకు చెందిన కళాకారులతో కాంతారా, కాళీమాత, పోతురాజు విన్యాసాలతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: మండల పరిధి నారాయణపూర్‌లో సోమవారం సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరయిన రూ.8లక్షల నిధులతో గ్రామంలోని కోటకొండ అంజిలప్ప ఇంటి నుంచి నాగులకట్ట వరకు సీసీ నిర్మిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పరి నర్సింహులు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అనంతగిరి: క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తాహర్ షరీఫ్, పలువురు పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించాలి



ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న అధికారులు

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని నిర్మించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించాలని సూచించారు. లబ్ధిదారులు ఎలా నిర్మించుకోవాలో నమూనా ఇంటిని ఇక్కడ నిర్మించనున్నామని ఆమె తెలిపారు. ఇంటి స్థలం ఉన్న వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి, రూ.5 లక్షలు చెల్లించనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారమే నిర్మించుకోవాలని స్పష్టంచేశారు. ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించుకొంటే అప్పుల పాలవుతారని వెల్లడించారు. మూడు విడతలుగా లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమచేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీఓ యాదగిరి, హౌసింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

కాపాడబోతే కేసులు పెడుతున్నారు..

ఉద్యమకారుడు రామన్నమాదిగ



డీఎస్పీని సన్మానిస్తున్న రామన్న మాదిగ

దోమ: ప్రభుత్వ భూములను కొందరు రియల్టర్లు కబ్జాచేస్తున్న నేపథ్యంలో అడ్డుకున్న తమపై అక్రమంగా కేసులు పెడుతున్నారని తెలంగాణ ఉద్యమకారుడు రామన్నమాదిగ ఆవేదన వ్యక్తంచేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ శ్రీనివాస్‌ను సోమవారం పరిగిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటు చేసి తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. అలాంటి తమపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కొంత కాలం క్రితం రియల్టర్లు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని సమాచారం రావడంతో కాపాడేందుకు వెళ్తే, తమపైనే అక్రమ కేసులు నమోదు చేయించి జైలుకు పంపారని వాపోయారు. ఈ అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు వెళ్లామన్నారు. వెంటనే తమపై ఉన్న కేసులను ఎత్తీవేసి, ఆదుకోవాలని డిమాండ్ కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఆంజనేయులు, తిరుమలయ్య, హుస్సేన్, సర్దార్ నాయక్, పాండు నాయక్, వెంకటేశ్, శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యని మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం బషీరాబాద్ మండల కేంద్రంలో మండలానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు రూ.52 లక్షల కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే సంక్రాంతి వరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ కరుణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ, ఏఎంసీ వైస్ చైర్మన్‌లు అజయ్‌ప్రసాద్, చందర్, నాయకులు రామునాయక్, కలాల్ నర్సిములు, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమ్మెలో సర్వశిక్ష ఉద్యోగులు

- కేజీబీవీలో బోధన బంద్
- ఆందోళన చెందుతున్న బాలికలు



మూతపడిన మండల వనరుల కేంద్రం

ధారూరు: సర్వశిక్షా అభియాన్ సిబ్బంది సమ్మె నేపథ్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యాబోధనకు తీవ్ర ఆటంకం కలిగింది. మండల వనరుల కేంద్రంలో సేవలు నిలిచిపోయాయి. ఎస్‌ఎస్‌ఏలో పనిచేస్తున్న సిబ్బంది డిమాండ్ల సాధనలో భాగంగా 18 రోజులగా నిరసన బాట పట్టారు. కేజీబీవీలో 13 మంది బోధన, 9 మంది బోధనేతర సిబ్బంది, ఎంఆర్‌సీలో నలుగురు సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీఎస్‌లో ఇద్దరు, పీటీఐఎస్‌లో 9 మంది, సీసీఓలో ఒకరు నిరసనలో పాల్గొన్నారు. దీంతో విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. ఓ వైపు పరీక్షలు దగ్గరపడుతుండటం, మరోవైపు టీచర్లు సమ్మెలో ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. పాఠాలు చెప్పేందుకు టీచర్లను పంపించాలని విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. లేనిపక్షంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించడం కష్టతరమని 10వ తరగతి బాలికలు వాపోతున్నారు.

ఎంఆర్‌సీలో..

ఎంఆర్‌సీలో విద్యాశాఖ పనులు ముందుకు సాగడం లేదు. సీఆర్‌పీలు నిరసనలో పాల్గొనడంతో రోజువారి పాఠశాలల తనిఖీ, డాటా ఎంట్రీ, మధ్యాహ్న భోజన వివరాల సేకరణ, నమోదు, ఆధార్ ఎంట్రీ, ఆఫర్ ఎంట్రీ తదితర కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయి.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కొడంగల్ రూరల్: సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్



దుద్యాల్: లగచర్లలో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

పర్యవేక్షిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసుకున్న దరఖాస్తులపై అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎనభైశాతం సర్వే పూర్తి చేశామని, మిగిలిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. ప్రజాపాలన దరఖాస్తులలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెల చివరి వరకు సర్వే పూర్తి చేస్తామని చెబుతున్నారు.



బోట్యానాయక్ తాండలో.. యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శి సురేష్

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చురుగ్గా సాగుతోంది. బొట్యానాయక్‌తండాలో పంచాయతీ కార్యదర్శి సురేష్ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంతోష్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో '108' సేవలు

హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు



108 అంబులెన్స్ వద్ద ఈఎంటీ, పైలెట్

దౌల్తాబాద్: నిన్నమొన్నటి వరకు మండల కేంద్రంలో 108 వాహనం అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అత్యవసర సమయంలో గర్భిణులు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారితో పాటు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు.. అంబులెన్స్ అందుబాటులో లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించే వారు. అదీ కూడ లేని సందర్భంలో కొన్ని మరణాలు సంభవించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ఎన్నోసార్లు పాలకులకు విన్నవించుకున్నా.. ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి మండల ప్రజలు సమస్య వివరించడంతో.. ఆయన 108 వాహనాన్ని మంజూరు చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సీఎం, ఆయన సోదరుడికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సంక్షేమమే బీజేపీ లక్ష్యం

అనంతగిరి: రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వికారాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో పలువురు రైతులను బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. రైతులను రాజుగా చేసేందుకు కేంద్రంలోని మోది ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, కన్వీనర్ మోహన్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పోరాటం

బొంరాస్‌పేట: ఎస్సీ వర్గీకరణ కోసం జాతీయ స్థాయిలో పోరాటం చేద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ అన్నారు. సోమవారం బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలోని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మందకృష్ణ మాదిగ ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనకు మద్దతునిద్దామన్నారు. త్వరలో మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి దప్పు మహేందర్, నాయకులు శ్రీనివాస్, పెద్ద నర్సింలు, రాములు, చిన్న నర్సింలు, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి యేసు, ఉపాధ్యాయుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ప్రభు, సంయుక్త కార్యదర్శిగా ఎఫ్. నరేశ్, సంయుక్త కార్యదర్శిగా శేరి సాయిలు, కార్యదర్శిగా కాశప్ప, కోశాధికారిగా రాజేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమగ్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..

అనంతగిరి: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి.. మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం విద్యావ్యవస్థ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, కృష్ణ, రాములు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు ఉన్నారు.

క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శం

అనంతగిరి: ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ సంబురాల్లో ఆమె మాట్లాడుతూ.. అన్ని మతాలు సమానేమనని, క్రైస్తవులు క్రిస్మస్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ సుధీర్, మైనార్టీ జిల్లా అధికారి హన్మంత్‌రావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పాస్టర్లు పాల్గొన్నారు.



వికారాబాద్: వేడుకల్లో పాల్గొన్న నేతలు

సెయింట్‌జూడ్స్‌లో..

పట్టణంలోని సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషా రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.